www.spmvv.ac.in

# SPMVV IN NEWS

JUNE,2026 VOLUME 3, ISSUE 6

# పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో



## ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి

**తిరుపతి,మే 28ప్రభాతవార్త:** పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో గురువారం విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు ఎన్టీరామారావు 103వ జయంతిని ఘనం గా నిర్వహించినారు . ఈ సందర్భం గా యూనివర్సిటీలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వందనం సమర్పించినారు. వర్సిటీ ఉపకులపతి ఆచార్య ఉమ వెన్నం,రిజిస్ట్రార్ ఆచార్య ఆర్ ఉష ఎన్‌టీఆర్ మహోన్నత వారసత్వాన్ని అద్భుతంగా వివరిస్తూ, మానవత్వం ఉన్నంతకాలం ఆయన ఆశయాలు, సేవలు మరియు వారసత్వం చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. మహిళల విద్యాభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మహిళల కోసం ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాన్ని స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమన్నారు.. ఈ కార్యక్రమంలో డీన్ ఆచార్య సి.వాణి , విభాగాధిపతులు , యూనివర్సిటీ ఇంజనీర్ శ్రీనివాసులు , డిప్యూటీ రిజిస్ట్రార్ బి.గీతావాణి ,బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు .

## బంగారు కుటుంబాల్లోని

# విద్యార్థినులకు ఉచిత విద్య

● **మహిళా వర్సిటీ వీసీ ఉమ**



**ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మహిళా వర్సిటీ వీసీ ఉమ తదితరులు**

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), మే 28 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాల్లోని విద్యార్థినులకు తిరుపతిలోని మహిళా వర్సిటీలో ఉచిత విద్యను అందిస్తామని వీసీ ఉమ తెలిపారు. ఒక్కో విభాగంలో ఒక్కొక్కరికి ఈ అవకాశం కల్పిస్తామని చెప్పారు. వీరికయ్యే అన్ని రకాల ఫీజులను వర్సిటీ భరిస్తుందన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా వర్సిటీ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి గురువారం రిజిస్ట్రార్ ఉషతో కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మహిళల విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిచ్చి, వారి కోసం ప్రత్యేకంగా ఎన్టీఆర్ స్థాపించిన విశ్వవిద్యాలయంలో పనిచేయడం తమ అదృష్టమన్నారు. డీన్ ప్రొఫెసర్ వాణి, విభాగాధిపతులు, ఇంజనీర్ శ్రీనివాసులు, డిప్యూటీ రిజిస్ట్రార్ గీతావాణి, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఏపీ లాసెట్

**తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే:** శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల్లోని వంద కేంద్రాల్లో నిర్వహించిన ఏపీ లాసెట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. తిరుపతిలోని కేంద్రాన్ని లాసెట్ ఛైర్‌పర్సన్, మహిళా వర్సిటీ వీసీ ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష, లాసెట్ కన్వీనర్ ఆచార్య టి.సీతకుమారి తనిఖీ చేశారు. మూడు సంవత్సరాల కోర్సులో 78 శాతం, ఐదేళ్ల కోర్సులో 83 శాతం, ఎల్‌ఎల్‌ఎం కోర్సులో 85 శాతం హాజరైనట్లు కన్వీనర్ తెలిపారు.

## మహిళా వర్సిటీలో ఎన్టీఆర్ మ్యూజియం

**తిరుపతి(మహిళా వర్సిటీ):** మానవత్వం ఉన్నంతకాలం ఎన్టీఆర్ ఆశయాలు, ఆశలు, వారసత్వం చిరస్థాయిగా నిలిచి ఉంటాయని శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ వీసీ ఆచార్య వి.ఉమ పేర్కొన్నారు. వర్సిటీలో గురువారం వీసీ, రిజిస్ట్రార్ పరిపాలనా భవనం ఎదుట ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వీసీ మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధి కోసం మహిళా వర్సిటీ ప్రారంభించినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్‌కు కృతజ్ఞతగా వర్సిటీలో ఆయన జీవితం, సినీ, రాజకీయ, సేవా చరిత్రపై పరిశోధనలు, పరిశోధనా పత్రాలతో పాటు చిన్న మ్యూజియం ఏర్పాటు చేస్తామన్నారు.

# మహిళా విశ్వవిద్యాలయంలో పోస్టుల భర్తీకి అనుమతి

కలికిరి, మే 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బోధనా విభాగానికి సంబంధించి ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేసుకునేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఖాళీగా వున్న రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడానికి అవసరమైన నోటిఫికేషన్ జారీ చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే ఇదే వర్శిటీలో ఖాళీగా వున్న పోస్టులను భర్తీ చేయడానికి 2023లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఉపసంహరించాల్సిందిగా కోరుతూ 2026 ఏప్రిల్ 10న జరిగిన వర్శిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించింది. ఈ పోస్టుల భర్తీ కోసం తాజా నోటిఫికేషన్ జారీ చేసేందుకు అనుమతించాల్సిందిగా కూడా కౌన్సిల్ కోరింది. ఈ వ్యవహారాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఖాళీగా వున్న పోస్టుల భర్తీ కోసం 2023లో జారీ చేసిన నోటిఫికేషన్ రద్దు చేస్తూ కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసేందుకు సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు తగు చర్యలు చేపట్టాల్సిందిగా వర్శిటీ రిజిస్ట్రార్‌ను కోరుతూ ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

తిరుపతి (మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థినులకు ఉన్నత విద్యను చేరువ చేయాలనే ఉద్దేశంతో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. పీ-4 కార్యక్రమం కింద కలెక్టర్ అడిగిన 'వర్సిటీ నుంచి మీ కాంట్రిబ్యూషన్ ఏంటి..?' అనే ప్రశ్నకు సమాధానంగా బంగారు కుటుంబం కింద గుర్తింపు పొందిన విద్యార్థినులకు ప్రతి కోర్సులో ఒకరికి పూర్తిస్థాయిలో ఉచిత విద్యను అందించనున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య ఉమా వెన్నం ప్రకటించారు.

# బంగారు తల్లికి ఉచితంగా ఉన్నత విద్య

## మహిళా వర్సిటీ కీలక నిర్ణయం

### అర్హులెవరంటే..?

బంగారు కుటుంబంగా ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక నంబరు జారీ చేసిన కుటుంబాలకు చెందిన విద్యార్థినులు ఈ పథకానికి అర్హులు. ప్రతి కోర్సులో ఒక విద్యార్థిని ఎంపిక చేసి పూర్తి ఫీజు మినహాయింపుతో విద్యను అందించనున్నారు. ఈ ప్రతిపాదనను గత డిసెంబరులో జరిగిన పాలకమండలిలో ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

### ఏటా 60మందికి లబ్ధి

వర్సిటీలో 27కు పైగా విభాగాలు, 59 కోర్సులు ఉన్నాయి. ఇందులో 5300కు పైగా విద్యార్థినులు ఉన్నారు. ఇందులో సుమారు 70 శాతం మంది పేదలే. ఈ పథకం ద్వారా ఏటా దాదాపు 60కి పైగా విద్యార్థినులు లబ్ధి పొందనున్నారు. సామాజిక న్యాయం, సమాన విద్యా అవకాశాలు, మహిళా సాధికారత అనే మూడు ప్రధాన లక్ష్యాలను ఒకేసారి సాధించే దిశగా మహిళా వర్సిటీ చేపట్టిన ఈ కార్యక్రమం భవిష్యత్తులో మరిన్ని విద్యాసంస్థలకు ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

### ఈ ఏడాది నుంచే అమలు

ఈ పథకాన్ని ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నట్లు దివంగత ఎన్టీఆర్ జయంతి రోజున వర్సిటీ వీసీ ఆచార్య ఉమా అధికారికంగా ప్రకటించారు. ఇప్పటికే ఎంబీఏ విభాగంలో ఒక విద్యార్థిని ఈ సదుపాయంతో చదువుతున్నట్లు వీసీ వెల్లడించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి వర్సిటీలోని ప్రతి కోర్సులోనూ అమలు చేయనున్నారు. నిరుపేద విద్యార్థినులకు ఇదో గొప్ప అవకాశం.

# లాసెట్ ఫలితాలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని న్యాయ విద్య కోర్సుల ప్రవేశాలకు నిర్వహించిన పీజీ లాసెట్, లాసెట్(మూడేళ్లు, ఐదేళ్లు) ఫలితాలు విడుదలయ్యాయి. ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నిర్వహించిన లాసెట్ పరీక్షల ఫలితాలను మంత్రి లోకేశ్ సోమవారం 'ఎక్స్'లో విడుదల చేశారు. లాసెట్‌లో 23,996 మంది పరీక్ష రాయగా.. 19,197 మంది ఉత్తీర్ణత సాధించారు. పీజీ లాసెట్‌లో 92.02 శాతం, లాసెట్(ఐదేళ్లు)లో 78.57 శాతం, లాసెట్(మూడేళ్లు)లో 79.07 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అభ్యర్థుల ర్యాంకు కార్డులను ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

# మహిళా వర్సిటీ విద్యార్థినులకు ఉద్యోగాలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్ న్యూస్ :** పద్మావతి మహిళా వర్సిటీలో చివరి ఏడాది చదువుతున్న ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్, ఎంసీఏ 18 మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని ప్లేస్‌మెంట్ అధికారి ఆచార్య బి.కిషోరి తెలిపారు. ఈ మేరకు బెంగళూరు, తిరుపతిలో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో మహిళా వర్సిటీ విద్యార్థినిలు పాల్గొన్నారు. ఇందులో డ్రీమ్ లెన్స్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ 18 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను ఉపకులపతి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్.ఉష అభినందించారు.

Published by: Central Networking Facility (CNF), Sri Padmavati Mahila Visvavidyalayam (Women's University), Tirupati-517502